క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం ప్రత్యేక పూజలు, పల్లకి సేవ గావించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మతల్లి

మనుబోలు : మనుబోలు మండల కేంద్రం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- ఊపిరి పీల్చుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ పటిష్టమైన చర్యలు చేపట్టారు. రెండు, మూడుచోట్ల చెదురు మదురు ఘటనలు మినహా ఎన్నికలు శాంతీయుత వాతావరణంలో జరిగాయి. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం రాత్రితో ముగిసినప్పటికీ పలు ప్రాంతాల్లో మంగళవారం వరకు అధికారులు బందోబస్తును కొనసాగించారు.

పోలింగ్ సమయంలో అస్వస్థత

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరు పాళెంలో 104, 105 పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం జరిగిన పోలింగ్ సమయంలో పలువురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు ఆరున్నర గంటలకే కేంద్రానికి చేరుకున్నారు. కేవలం పోలింగ్ బూత్‌ల ముందు మాత్రమే షామియానాలు ఏర్పాటు చేశారు. అయితే ఓటు పోల్ చేసేందుకు అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో ఎండలోనూ క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రెండు పోలింగ్ బూత్‌లు ఒకే చోట ఏర్పాటు చేయడం, అక్కడకు చేరుకునేందుకు ఇరుకైన మార్గం ఒక్కటే ఉండడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఓ దశలో అధికంగా ఓటర్లు చేరుకున్న క్రమంలో తీవ్ర వేసవి ఎండకు ఊపిరి ఆడక లైన్‌లో అక్కడక్కడ ఉన్న ఏడుగురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలోని వైద్య సిబ్బంది వారికి ప్రథమ చికిత్స అందించారు.

ఎన్నికల రాకపోకలకు తప్పని అవస్థ

సీతారామపురం: ఓటు వేయాలనే సంకల్పంతో వలస ఓటర్లు వందల కిలో మీటర్ల దూరం నుంచి గ్రామాలకు చేరుకున్నారు. బస్సుల్లో ఖాళీ లేకపోయినా అష్టకష్టాలు పడి స్వగ్రామాలకు వచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి ఓట్లు వేశారు. తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్య, ఉపాధి రీత్యా చెన్నై, పుణె, గోవా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉంటున్న వారందరూ ఆది, సోమవారాల్లో మండలానికి చేరుకున్నారు.

సర్వేపల్లిలో ఏకపక్షంగా పోలింగ్

- 2019 ఎన్నికల సరళే కనిపించిందన్న విశ్లేషకులు
- భారీగా పాల్గొన్న మహిళా ఓటర్లు
- మండలాల వారీగా ఓటెత్తిన వైనం



పొదలకూరులో సోమవారం ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ఏకపక్షంగా జరిగినట్లు ఓటింగ్ సరళిని బట్టి రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓట్లు వేయడం వల్ల ప్రభుత్వ అనుకూల ఓట్లే అధికంగా వేసినట్లుగా తెలుస్తోంది. ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు బారులుతీరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రాత్రి 11 గంటల వరకు తోటపల్లిగూడూరు మండలం తోటపల్లి కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. సంక్షేమ పథకాలు బాగా ప్రజల్లోకి వెళ్లడం వల్లనే ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగిందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. దీనికితోడు సర్వేపల్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రిగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి వల్ల కూడా జనాలను అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రప్పించేలా చేసింది. సర్వేపల్లిలోని ఐదు మండలాల్లో తోటపల్లిగూడూరు మండలంలో అత్యధికంగా 85.69 శాతం ఓట్లు పోలయ్యాయి. ఏ మండలంలోనూ 80 శాతానికి తగ్గకుండా పోట్లు పోలుకావడం విశేషం

ప్రభుత్వ అనుకూలతకు సంకేతం

పోలింగ్ పర్సంటైల్ పెరగడం ప్రభుత్వ అనుకూలతకు సంకేతంగా భావిస్తున్నారు. అయితే కొందరు ఓట్లు శాతం పెరగడం ప్రతిపక్షాలకు అనుకూలంగా మారుతుందనే ప్రచారం చేస్తున్నా విశ్లేషకులు మాత్రం గతంలో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ అనుకూలతను గుర్తుచేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

2019లో సర్వేపల్లిలో 79 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. మంత్రి కాకాణికి 14 వేల ఓట్ల మెజారిటీ సాధించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

సర్వేపల్లిలో 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 5,457 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై విజయం సాధించారు. తర్వాత 2019 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాకాణి 14 వేల మెజారిటీ సాధించి వరుసగా రెండో పర్యాయం విజయకేతనం ఎగురవేశారు. మూడో పర్యాయం 2024లో సర్వేపల్లి నుంచి సోమిరెడ్డిపై పోటీ చేసిన కాకాణి ఘనవిజయం సాధిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఓటింగ్ సరళిని పరిశీలించిన పార్టీ నాయకులు తమ నాయకుడు హ్యాట్రిక్ విజయం అందుకోబోతున్నట్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఐదు మండలాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఉంటుందని వెల్లడిస్తున్నారు. పొదలకూరు మండలం నుంచి ఊహించని మెజారిటీ వైఎస్సార్‌సీపీ ఖాతాలో చేరనున్నట్లు లెక్కలు కడుతున్నారు.

83.39 శాతం పోలింగ్

వెంకటాచలం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సర్వేపల్లి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 83.39 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 2,32,011 మంది ఓటర్లు ఉండగా 1,93,472 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఎన్నికల ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.



నియోజకవర్గ పరిధిలో మండలాల వారీగా

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనవి	శాతం
వెంకటాచలం	52,285	44,291	84.71
పొదలకూరు	59,937	48,005	80.09
తోటపల్లిగూడూరు	41,593	35,639	85.69
ముత్తుకూరు	45,965	38,152	83
మనుబోలు	32,231	27,385	84.96

రికార్డు స్థాయిలో పోలింగ్



తోటపల్లి పోలింగ్ కేంద్రంలో హడావుడి



మనుబోలులో..

- కొన్ని గ్రామాల్లో రాత్రి వరకు సాగిన వైనం

మనుబోలు : మనుబోలు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. పలు గ్రామాల్లో 90 శాతానికిపైగా ఓటింగ్ నమోదు కావడం విశేషం. మొత్తంగా మండలంలో 85.30 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 32,231 మంది ఓటర్లు ఉండగా 13,547 మంది పురుషులు, 13,947 మంది మహిళలు ఉన్నారు. మొత్తంగా 27,494 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 42 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మనుబోలులో గరిష్ఠంగా 10 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. వేసవి ఎండల ప్రభావంతో ఉదయం 7కే భారీగా ఓటర్లు పోలింగ్ స్టేషన్‌ల వద్ద బారులు తీరా రు. పలు స్వచ్ఛంద సంస్థలు, శ్రీసేవానాథం ట్రస్ట్ సభ్యుడు ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరిచి ఓటింగ్ పెరగడానికి దోహదపడ్డారు.

టీడీగూడూరులో 85.69 శాతం

తోటపల్లిగూడూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మండల పరిధిలో 85.69 శాతం రికార్డు పోలింగ్ నమోదైంది. మండలంలోని 22 పంచాయతీల్లో 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 350 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనగా, 80 మంది పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 41,593 ఓటర్లు ఉండగా 35,639 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 17,539 మంది పురుషులు, 18,099 మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాధవరెడ్డి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. కాగా పేడూరు, తోటపల్లి పంచాయతీల్లో పోలింగ్ ప్రక్రియ రాత్రి వరకు సాగింది. 1,140 మంది ఓటర్లకు ఒకే బూత్ ఉండడంతో తోటపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్‌లో రాత్రి 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. దీంతో సంబంధిత బూత్‌లోని ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

మహిళలే నిర్ణేతలు



కోవూరులోని ఓ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటు వేసిన మహిళలు

- ముగిసిన పోలింగ్ పండగ
- కోవూరు నియోజకవర్గంలో 79.27 శాతం పోలింగ్
- గతం కంటే 1.61 శాతం ఎక్కువ
- ప్రసన్న వైపే ప్రజలు

కోవూరు : కోవూరు నియోజకవర్గంలో పోలింగ్ పండగ ముగిసింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. గతేడాది 77.66 శాతం నమోదవగా ఈ ఏడాది మరింత పెరిగి 79.27గా నమోదైంది. ఇందులో పురుషులు 1,03,366, మహిళలు 1,08,556 మహిళ మణులు, ఇతరులు ఏడుగురితో కలిపి మొత్తం 2,11,930 మంది ఓటర్లు వేశారు. ఇందులో పురుషుల కంటే మహిళలు 5,190 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలు, మహిళల పక్షపాతిగా నిలిచారు. ఈ రుణం తీర్చుకునేందుకు నియోజకవర్గ మహిళలు ఓట్ల రూపంలో ఆయనకు అండగా నిలిచారని తెలుస్తోంది. కాగా ఎప్పుడూ లేనివిధంగా ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడం విశేషం.

వైఎస్సార్‌సీపీకే విజయావకాశాలు

గత ఐదేళ్ల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో అన్నివర్గాల ప్రజల్లో వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. దీంతో ఆ పార్టీకే పూర్తిస్థాయి విజయావకాశాలు ఉన్నాయి. దీనికి తోడు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అందరివాడిగా అందుబాటులో ఉండడంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 1,01,200 గడపలు తిరిగారు. ఆయా కుటుంబాలను స్వయంగా పలకరించడంతో పాటు వారికి జరిగిన లబ్ధిని వివరించారు. దీంతో పాటు నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే ప్రసన్న తన తండ్రి పేరు మీదు ఉన్న నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించే వారు. అంతేకాకుండా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందించడం, తల్లిదండ్రులు లేని చిన్నారులకు వారి పేరుమీద కొంత నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం, ఆదరణ కరువైన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం వంటివి చేసేవారు. దీంతో ఎమ్మెల్యే ప్రసన్నపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉంది.



ఏడో సారి..

ఇప్పటికే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఏడో సారి అసెంబ్లీకి పంపేందుకు కోవూరు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. 1990 నుంచి రాజకీయాల్లో ఉన్న ప్రసన్న నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. 2019 ఎన్నికల్లో 39,891 ఓట్ల మెజార్టీతో ప్రసన్న గెలుపొందారు. ఇందులో టీడీపీ తరపున పోటీ చేసిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి 76,348 (37.14 శాతం) ఓట్లు పోలవగా, ప్రసన్నకు 1,16,239(56.55 శాతం) ఓట్లను ప్రజలు అందించి తిరుగులేని విజయం అందించారు. అదేవిధంగా 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో 42 శాతం ఓట్లతో గెలుపొందిన ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రెండో ఎమ్మెల్యేగా నిలిచి రాష్ట్రంలోనే ప్రత్యేకతను చాటుకున్నారు. అప్పుడు టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి 28.64 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు కలిపి ప్రసన్నకుమార్‌రెడ్డికి చారిత్రాత్మక విజయం అందుకోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో..

మండలం	మొత్తం ఓటర్లు	పోలైనవి	శాతం
కోవూరు	65,113	49,793	76.47
బుచ్చిరెడ్డిపాళెం	70,602	53,664	76.01
కొడవలూరు	41,301	33,080	80.09
విడవలూరు	41,813	33,776	80.78
ఇందుకూరుపేట	48,516	41,617	85.78

54వ డివిజన్‌లో ప్రగతి పుంతలు



నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్



అభివృద్ధి చేసిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం

- రూ.85 కోట్లతో అభివృద్ధి పనులు
- అన్నిరకాల మౌలిక వసతులు ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 54వ డివిజన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రగతి పుంతలు తొక్కాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన తరువాత రూ.85 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ చొరవతో ఈ డివిజన్‌లో పలు రకాల అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగింది. డివిజన్ పరిధిలోని జనార్దనరెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, వెంకటేశ్వరపురం, ఇస్లాంపేట పరిసర ప్రాంతాల్లో రూ.85 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ఈ ప్రాంత రూపురేఖలే మారాయి.

- 14 సంవత్సరాలుగా భగత్‌సింగ్‌కాలనీలో ఉంటూ ఇళ్లు లేని 700 మందికి ఇళ్ల పట్టాల అందజేత.
- జనార్దనరెడ్డి కాలనీలో పిల్లలు ఆడుకునేందుకు, ప్రజలు వాకింగ్ చేసేందుకు పార్కును నిర్మించారు.
- వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీకి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్న దృష్ట్యా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీ వరకు నాలుగు లేన్ల సిమెంట్‌రోడ్డును నిర్మించారు.
- 30 సంవత్సరాలుగా జనార్దనరెడ్డికాలనీలో ఉన్న హిందూ శ్మశానవాటిక అన్యాక్రాంతం కాకుండా, శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు.
- నీటి సరఫరాను మెరుగు పరిచేందుకు తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టారు.
- విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా జగనన్న కాలనీలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడంతో పాటు, జనార్దనరెడ్డి కాలనీ ఉన్న పాత విద్యుత్ సబ్‌స్టేషన్ స్థానంలో నూతన ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు.
- వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ప్రధాన పాఠశాల, జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న ఉర్దూ పాఠశాల, భగత్‌సింగ్ కాలనీలోని పాఠశాలలకు 'మనబడి నాడు-నేడు' కింద అదనపు తరగతులు నిర్మించారు.
- జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించి అన్ని వసతులు ఏర్పాటు చేశారు.
- వెంకటేశ్వరపురం నుంచి పెన్నానదిలోకి వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మించిన ప్రధాన కాలువ వెంబడి ప్రమాదాలు జరుగుతుండడంతో కాలువ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు.
- 54వ డివిజన్‌లో నూతనంగా సిమెంట్ రోడ్లు, కాలువలు తదితర పలు అభివృద్ధి పనుల కోసం ఏకంగా రూ.85 కోట్లు ఖర్చు చేయడంతో 54వ డివిజన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయినట్లు తెలియజేశారు.

ఇల్లు ఇచ్చి ఆదుకున్నారు



నాకు చిన్నతనంలో పోలియో వచ్చి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. నా భర్త మస్తాన్ రిక్షా తొక్కి కుటుంబాన్ని పోషిస్తుండేవారు. పదేళ్ల క్రితం ఆయన మృతిచెందాడు. ఇద్దరు పిల్లలు పెళ్లి చేసుకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం నేను ఒంటరిగా జీవిస్తున్నా. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా క్రమం తప్పకుండా ఇంటికి బియ్యంతో పాటు రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. నాకు సొంతిల్లు లేకపోవడంతో భగత్‌సింగ్‌కాలనీలో చిన్న అద్దె ఇంట్లో ఉంటున్నా. నా పరిస్థితిని చూసి స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వలంటీర్‌తో చెప్పి జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేయించారు. జగనన్న పుణ్యమా అని నాకు సొంతిల్లు వచ్చింది. మాలాంటి వాళ్లకు జగన్ దేవుడు.

– జమీలమ్మ, దివ్యాంగురాలు, భగత్‌సింగ్‌కాలనీ, నెల్లూరు నగర నియోజకవర్గం



వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి జనార్దనరెడ్డికాలనీకి వేసిన నాలుగు లేన్ల నూతన సిమెంట్ రోడ్డు



హిందూ శ్మశానవాటికకు నిర్మించిన ప్రహరీ

ఇచ్చిన హామీ నెరవేర్చారు



భగత్‌సింగ్ కాలనీ ఏర్పడినప్పటి నుంచి 14 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోనే భర్త రసూల్‌తో కలిసి టీ అంగడి పెట్టుకుని జీవిస్తున్నాం. గతంలో అనేక సార్లు భగత్‌సింగ్‌కాలనీలో ఉంటున్న 700 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరాం. ఎన్నికల సమయంలో వచ్చి హామీ ఇచ్చారే తప్ప ఎవరూ మా గురించి పట్టించుకోలేదు. అయితే గత ఎన్నికల సమయంలో అనిల్‌కుమార్ యాదవ్ భగత్‌సింగ్‌కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన విధంగానే ఇళ్ల పట్టాలు ఇచ్చారు.

– కరీమా, టీ దుకాణం నిర్వాహకురాలు, భగత్‌సింగ్‌కాలనీ